క్లుప్తంగా

భక్తురాలిపై వ్యాపారుల దాడి

సీఐతో ఈవో సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తురాలిపై కొబ్బరి కాయల వ్యాపారాలు చేసేవారు దాడికి పాల్పడిన నేపథ్యంలో వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్‌తో దుర్గగుడి ఈవో శీనానాయక్ శనివారం సమావేశమై చర్చించారు. విజయేశ్వర ఆలయ పరిసరాలు, చైనావాల్, రథం సెంటర్ పరిసరాల్లో ఉన్న ఆక్రమణదారులు భక్తులపై దాడి చేయడాన్ని తీవ్ర చర్యగా భావిస్తున్నామని ఈవో పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలతో ఆలయ ప్రతిష్ట, భద్రతకు భంగం కలుగుతోందన్నారు. ఆక్రమణల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటమే కాకుండా భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, సీపీతో చర్చించి తగిన రీతిలో చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు.

అలరించిన ఆపాత మధురాలు



విజయవాడ కల్చరల్: గంగా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నెల వారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన ఆపాత మధురాల సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. గాయనీ గాయకులు సింధూ, రజని, మల్లీశ్వరి, కృష్ణ కుమారి, వేణుగోవింద్ తదితరులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. గంగా ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకుడు గంగాధర్ మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు పేద కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమ కన్వీనర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, టీవీ వీరభద్రరావు, ఆదిరాల జయప్రభు పాల్గొన్నారు. గాయనీ గాయకులను, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ఎవరు వారు..? ఎక్కడి నుంచి..!

- నైట్ షెల్టర్లు ఉన్నా.. ఫుట్‌పాత్‌లు, డివైడర్లే ఆవాసాలు
- డబ్బు ఉందని తెలిస్తే దాడి చేసి దోచుకోవడమే
- గుర్తు తెలియని వ్యక్తులుగా అక్కడే మృతి
- పోలీసులకు సవాల్‌గా మారుతున్న వైనం



హెడ్ వాటర్ వర్క్స్ ముందు ఫుట్‌పాత్‌పై వలస కూలీలు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): వారంతా ఎవరో.. ఎక్కడి నుంచి వచ్చారో ఎవరికీ తెలియదు. కొందరు జీవనోపాధి కోసం వివిధ రాష్ట్రాల నుంచి విజయవాడ నగరానికి చేరుకుంటారు. గృహ నిర్మాణ పనులు, కూలి పనులు, హోటల్స్‌లో పని చేస్తూ కాలం వెళ్లదీస్తుంటారు. పనులు ముగించుకుని ఎక్కడో ఒక చోట ఒక ముద్ద తినేసి కృష్ణానది తీరానికి చేరుకుంటారు. అక్కడ శుభ్రంగా స్నానం చేసి ఫుట్‌పాత్‌లు, డివైడర్ల వద్దకు వచ్చి పడుకుంటారు. నైట్ షెల్టర్లు ఉన్నా అవగాహన లేకో, స్వేచ్ఛగా ఉండదనుకుంటారోగానీ అక్కడికి వెళ్లరు. ఫుట్‌పాత్‌లు, డివైడర్లే వారి ఆవాసాలు. వీరంతా వలస కూలీలుగా భావించవచ్చు. ఇక్కడి వరకు బాగానే ఉంది. ఎవరికీ ఇబ్బందీ లేదు.

అయితే ఫుట్‌పాత్, డివైడర్లను ఆశ్రయించేవారిలో పనీపాట లేని 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న వారు కూడా ఉండటం గమనార్హం. ఏదో ఒక పని చేయగలిగికూడా దాతలు ఉదారంగా ఉదయం అందించే అల్పాహారం, మధ్యాహ్న భోజనానికి అలవాటుపడి వాటిని తినేసి ఎంచక్కా పేపర్ (ఇంగ్లిష్‌తో సహా) చదువుకుంటూ రోజులు గడిపేస్తున్నారు.

నాలుగైదు భాషలు..

పశ్చిమ నియోజకవర్గంలో గట్టు వెనుక ప్రాంతంలో అనేక చోట్ల పాదచారులు నడిచేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లే వారికి ఆవాసాలు. ఇటువంటి వారు తెలుగుతోపాటు నాలుగైదు భాషల్లో మాట్లాడే ఇతర రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు.

ఎక్కడెక్కడ ఉంటారంటే..?

భవానీపురం పున్నమి హోటల్ ముందున్న కనకదుర్గ ఫ్లైఓవర్ కిందున్న హెచ్‌బీ- 2 పార్క్ చుట్టూ, విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో ఫ్లైఓవర్ కింద, ఇంకొంచం ముందుకు వెళితే మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ ముందున్న ఫుట్‌పాత్‌లపై ఎక్కడ చూసినా వారు కనిపిస్తుంటారు. ఇతర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం వన్‌టౌన్ రథం సెంటర్‌లో నిత్యం దాతలు అన్నదానం చేస్తుంటారు. భక్తులతోపాటు భోజనం చేసి అక్కడే సెంట్రల్ డివైడర్ మధ్యలో మొక్కల మధ్య పడుకుంటున్నారు. విద్యాధరపురం నుంచి చిట్టినగర్‌కు వెళ్లే సొరంగ మార్గంలో రెండు వైపులా ఫుట్‌పాత్‌పైకూడా ఉంటున్నారు.



పున్నమి హోటల్ ఎదురుగా ఫ్లైఓవర్ కింద వలస కూలీలు

పోలీసులకు సవాల్‌గా..

ఫ్లైఓవర్ కింద ఫుట్‌పాత్, డివైడర్ల మధ్యలో, సొరంగ మార్గంలో పడుకున్న వారిలో కష్టపడి సంపాదించలేని అనారోగ్యంతో ఉన్నవారు లేకపోలేదు. కూర్చుంటే లేవలేని వృద్ధులూ ఉన్నారు. అలా అక్కడక్కడా ఉంటున్నవారిలో కొందరు అకస్మాత్తుగా చనిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. పోలీసులు చనిపోయిన వ్యక్తి తాలూకా బ్యాగ్, సంచి ఉంటే వెతికి ఏమైనా ఆధారాలు లభిస్తే వారికి సంబంధించినవారికి సమాచారం అందిస్తారు. వారు వస్తే పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగిస్తున్నారు. ఊరూ, పేరూ తెలియని కొందరు గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి.

మూడు రోజుల కిందట..

మూడు రోజుల క్రితం సొరంగ మార్గంలో ఉండే గుర్తు తెలియని వ్యక్తి చనిపోవడంతోమృతుడు ఎవరికైనా తెలిస్తే సమాచారం ఇవ్వమని భవానీపురం పోలీసులు పత్రికల్లో ప్రకటన ఇచ్చారు.

ఇలా చేస్తే సరి..

కనకదుర్గ ఫ్లైఓవర్ కింద, సొరంగం మార్గంలో, డివైడర్ల మధ్య ఉంటున్న వ్యక్తులను గుర్తించి ఎక్కడ నుంచి వచ్చారు, ఇక్కడ ఎందుకు ఉంటున్నారు, బంధువులు/తెలిసివారు ఎవరైనా ఉన్నారా, ఆధార్ కార్డులు ఉన్నాయా లేవా తదితర విషయాలపై పోలీసులు నగరపాలక సంస్థ అధికారులతో సమన్వయం చేసుకుని విచారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితులో ఉంటున్న వారిని నైట్ షెల్టర్లకు తరలించాలని కోరుతున్నారు.

వీరిని ఆసరా చేసుకుని..

ఎవరి దగ్గరైనా డబ్బు ఉన్నట్లు తెలిస్తే బ్లేడ్ బ్యాచ్‌కి చెందిన కొందరు ఇలా ఫుట్‌పాత్‌పైనో లేదా సొరంగ మార్గంలోనో నిద్రించే వారి పక్కనే పడుకుని వారివద్ద ఉన్న డబ్బు కొట్టేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. తమ కళ్ల ముందే జరుగుతున్న ఇటువంటి సంఘటనలు చూసికూడా తాము ఏమీ చేయలేని దుస్థితిలో ఉన్నామని, ఎదురు తిరిగితే తమ మీద బ్లేడ్‌తో ఎక్కడ దాడి చేస్తారేమోనని భయపడుతున్నామని అంటున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పాయకాపురం(విజయవాడరూరల్): పర్యావరణ పరిరక్షణకు శనివారం విలేజ్ కండ్రిక రోడ్డులో 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ డివిజన్లో మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. 35 వేప మొక్కలు,35గానుగ మొక్కలు, 30 పొగడ మొక్క లు నాటారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు యరగొర్ల శ్రీరాములు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపిరాజు, డ్వాక్రా సంఘాల సీవో కిషోర్, యూసీడీ జగదీశ్వరీ, ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీ మెంబర్లు, విక్టర్ బాబు పాల్గొన్నారు.

త్యాగ జీవితమే బక్రీద్ పండుగ పరమార్థం



బక్రీద్ ప్రార్థనల్లో ముస్లిం మత పెద్దలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం మత పెద్ద దుర్వేసుల హుస్సేన్ ఆధ్వర్యంలో గొల్లపూడి పంచాయతీ పరిధిలోని హెచ్‌బీ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో బీజేపీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ బాజీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముస్లిం మత గురువు (హఫీజ్) ఫరూఖ్, ఎండీ రియాజుద్దీన్ బక్రీద్ పండుగ విశిష్టతను వివరిస్తూ ఇస్లాం సూచించిన సన్మార్గంలో నడిచి పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు దుర్వేసుల హుస్సేన్ మాట్లాడుతూ త్యాగానికి, సహనానికి ప్రతీక బక్రీద్ పండుగ అన్నారు. పండుగ సంతోషాన్ని అందరితో కలిసి పంచుకున్నప్పుడే దానికి సార్థకత చేకూరుతుందని బక్రీద్ సందేశం అదేనని పేర్కొన్నారు. హజ్‌కు వెళ్లలేనివారు ఖుర్బానీ ద్వారా బక్రీద్ పుణ్యఫలాన్ని పొందగలిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్తిపాటి శ్రీధర్, ఎమ్ఎస్ బేగ్, సలీం, మీరావలి, ఖాసీం, పలువురు ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

చిట్టినగర్‌లో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బక్రీద్‌ను పురస్కరించుకుని చిట్టినగర్ మోతీ మసీదు ఈద్గాలో ముస్లింలు శనివారం సామూహిక ప్రార్థనలు చేశారు. ఉదయం 10 గంటల సమయానికి నగరంలోని భవానీపురం, వించిపేట, పంజా సెంటర్, నైజాంగేటు, సింగ్‌నగర్, వైఎస్సార్ కాలనీ, లంబాడీపేట ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ముస్లింలు ఈద్గా ఆవరణకు చేరుకున్నారు. ఈద్గా ఆవరణలో మోతీ మసీదు ఇమామ్ నజీర్ అహ్మద్ ముస్లింలచే ప్రత్యేక నమాజును చేయించారు. ఈ సందర్భంగా నజీర్ అహ్మద్ మాట్లాడుతూ బక్రీద్‌కు ఖుర్బానీ ఇచ్చేవిధంగా ఎన్ని నియమ నిబంధనలను పాటిస్తామో.. అల్లా కృపకు పాత్రులు కావాలంటే అంతే నియమంగా ఉండాలని సూచించారు. ప్రవక్త ఇబ్రహీం త్యాగం, అల్లాహ్ పట్ల నిస్వార్థమైన భక్తిని బక్రీద్ గుర్తు చేస్తుందన్నారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలను పురస్కరించుకుని కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈద్గా ఆవరణలో కూలర్లు, మంచినీటిని ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనలను పురస్కరించుకుని వెస్ట్ ఏసీపీ దుర్గారావు, సీసీఎస్ ఏసీపీ సీహెచ్. వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కొత్తపేట సీఐ చిన కొండలరావు బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం కేటీ రోడ్డుపై ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ ఏడాది బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల సమయంలో రాజకీయ నాయకులు సందడి కనిపించ లేదు.



మోతీ మసీద్ ఈద్గా వద్ద మాట్లాడుతున్న నజీర్ అహ్మద్

నియోజకవర్గ స్థాయిలో యోగాంధ్ర పోటీలు



పటమట(విజయవాడతూర్పు): నగర పాలక సంస్థ పరిధిలో యోగాంధ్ర పోటీలు శనివారం గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో నిర్వహించారు. నగరంలోని మూడు నియోజకవర్గాల నుంచి ఔత్సాహిక పోటీదారులు ఇందులో పాల్గొన్నారు. పోటీలు వివిధ వయస్సు కేటగిరీల్లో జరగ్గా ఆయా విభాగాల్లో పాల్గొన్న విజేతలు తర్వాత జరిగే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు కె.ప్రభుదాస్, కె.షమ్మీ, రమ్య కీర్తన, పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దు



కేదారేశ్వరపేటలో ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మూడవ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు

సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): రోడ్డు, డ్రెయిన్, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటే అటువంటి వారిపై ట్రాఫిక్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని మూడవ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్‌బాబు హెచ్చరించారు. శనివారం కేదారేశ్వరపేటలోని ఫ్రూట్ మార్కెట్, రైతు బజారు ప్రాంతాలలో ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై అనుమతులు లేకుండా నిలిపిన తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌లు, డ్రెయిన్లపై స్థిరంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలు, రోడ్డుమీదే ఎగుమతి, దిగుమతి చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ వాహనాల యాజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన రెండు బొలెరో వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ వాహనదారులు, వ్యాపారులు తమ వ్యాపార సంబంధిత వస్తువులను తమకు కేటాయించిన ప్రదేశాల్లోనే ఉంచుకోవాలని, రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను నిలపడం వలన సాధారణ ప్రజలకు, అత్యవసర వాహనాలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయన్నారు. మార్కెట్ గేట్ల వద్ద వాహనాలను పార్క్ చేయడం వల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని, అటువంటి వాహనదారులు కొంత దూరంలో పార్క్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటువంటి డ్రైవ్‌లు ప్రతిరోజూ జరుగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అనధికార తరగతుల నిర్వహణపై ఏఐఎస్ఎఫ్ ఆందోళన



విద్యా సంస్థ వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు

పటమట(విజయవాడతూర్పు): గోల్డెన్ ఐ పేరుతో అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్న కళాశాలను వెంటనే సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆందోళన చేపట్టింది. బెంజిసర్కిల్ వద్ద గోల్డెన్ ఐ పేరుతో అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు శనివారం ఆ సంస్థ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ మాట్లాడుతూ గోల్డెన్ ఐ అనే పేరుతో అక్రమంగా వేసవి సెలవుల్లో ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇలాంటి విద్యా సంస్థలపై ఇంటర్మీడియెట్ బోర్డు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పటమట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనను విరమింపచేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధిక్ బాబు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి, విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ జగదీష్ కోశాధికారి సురేష్, నాయకులు సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు


చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆలయానికి వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. బీటెక్ చదివి ఇంటివద్దనే ఉంటున్న వించిపేట దొడ్లవారి వీధికి చెందిన ఓ యువతి శనివారం ఉదయం ఆలయానికి వెళ్లి వస్తానని తల్లిదండ్రులకు చెప్పింది. అయితే మధ్యాహ్నమైనప్పటికీ సదరు యువతి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆలయ పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తమ కుమార్తె కనిపించడం లేదంటూ యువతి తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యలవాడగా వెలుగొందుతున్న విజయవాడ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యలవాడ అంటే విజయవాడ నగరం గుర్తుకురాక మానదు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలతో విజయవాడ నగరం వెలుగొందుతోంది. ముఖ్యంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పేద, మధ్యతరగతిపాటు ఉన్నతవర్గాల ప్రజలు వారి పిల్లలను ఆయా ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు. అదేవిధంగా పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్లు, చిన్నారుల మేధకు పదునుపెట్టే సిప్ అకాడమి బ్రాంచిలు ఇక్కడ ఉన్నాయి. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాన రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు విజయవాడ నగరానికి చేరుకోవడంతో కాలేజీలు, పాఠశాలలకు డిమాండ్ మరింత పెరిగింది. గత ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువచ్చిన పెనుమార్పులు, సంస్కరణలతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు డిమాండ్ పెరిగింది. ఒక సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు ఖాళీ లేదని బోర్డులు కూడా పెట్టడం గమనార్హం. అలాగే పశ్చిమ నియోజకవర్గం కబేళా ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా రావడంతో పేద విద్యార్థులకు ఊరట లభించింది. భవానీపురంలో ఉన్న గురుకుల మైనార్టీ బాలికల పాఠశాలలో అనేక ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. మొత్తం మీద విద్యలవాడగా ప్రసిద్ధి చెందిన విజయవాడ నగరం ఆ పేరును సార్థకం చేసుకుందనడంలో అతిశయోక్తి లేదు.

అబాకస్ కోచింగ్‌లో అగ్రగామి..



మధుసూదనరావు

అంతర్జాతీయ గుర్తింపు పొందిన సిప్ అబాకస్ కోచింగ్ ఇనిస్టిట్యూట్‌ను 2007లో భవానీపురం, వన్‌టౌన్‌లో వేర్వేరుగా బ్రాంచీలు ఏర్పాటు చేసినట్లు ఇనిస్టిట్యూట్ హెడ్ మధుసూదనరావు తెలిపారు. అబాకస్ కోచింగ్ తీసుకునే విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెరుగుతుంది. తద్వారా స్కూల్ విద్యలో కూడా రాణిస్తారు. దీంతో సిప్ అబాకస్‌పై తల్లి దండ్రుల్లో మరింత నమ్మకం ఏర్పడింది. విద్యార్థుల పట్టుదలతోపాటు వారి తల్లి దండ్రుల సహకారంతో విజయవంతంగా 19వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం సంతోషంగాను గర్వంగానూ ఉందని మధుసూదనరావు వివరించారు.

యోగాతో జీవనశైలిలో గొప్ప మార్పులు



యోగా చేస్తున్న ఆలయ ఈవో శీనానాయక్, ఆలయ సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరూ నిత్యం పది నిమిషాల పాటు యోగా చేయడం వల్ల జీవనశైలిలో వచ్చే గొప్ప మార్పులను గమనించవచ్చని దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. యోగాంధ్రలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని మహా మండపం ఆరో అంతస్తులో శనివారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా నిపుణులు డాక్టర్ ప్రియదర్శిని, యోగా థెరపిస్ట్ ఎస్.లక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆలయ ఈవో శీనానాయక్, ఈఈ కేవీఎస్ఆర్.కోటేశ్వరరావు, ఏఈవో పి.చంద్రశేఖర్, జంగం శ్రీనివాస్, డాక్టర్ కె.గంగాధర్‌లతో పాటు ఆలయానికి చెందిన సుమారు 300 మంది పాల్గొన్నారు. ఏ హోదా, ఎంత డబ్బు ఉన్నా ఆరోగ్యం లేకుంటే అన్ని వృథానేనని, నేడు ఆధునిక జీవనంతో ఇళ్లలో, కార్యాలయాల్లో శారీరక శ్రమ లేకుండా జీవనం సాగిస్తున్నామన్నారు. దీంతో అనేక వ్యాధులకు గురవుతున్నారని, అవగాహనతో యోగా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. యోగా ద్వారా శరీరానికి ధృఢత్వం, మానసిక స్థిరత, అంతర్గత శాంతి లభిస్తాయని యోగా నిపుణులు పేర్కొన్నారు.